క్లుప్తంగా

కడప మేయర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబును కడపలోని ఆయన నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కలిశారు. ఇటీవల సురేష్‌బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఎమ్మెల్యే రాచమల్లు ఆయనను పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సురేష్‌బాబు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

నేడు రథ సప్తమి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని మహాలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వేకువజామున చెన్నకేశవస్వామికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులకు సూర్యకిరణాలు తాకిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవం నిర్వహించి, అనంతరం ఆలయం వెలుపల రథం పై కొలువుదీర్చనున్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొనాలని ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

వృద్ధులకు చేయూతనందించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : వృద్ధులకు చేయూతనందించాలని తులసి సేవా సంఘం అధ్యక్షురాలు ఎం.తులసి పేర్కొన్నారు. స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమం, విద్యార్థి అనాథ బాలల శరణాలయంలో శుక్రవారం అన్నదానం కార్యక్రమంతోపాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులకు, అనాథలకు సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు అనురాధ, వినీత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు తపాలాశాఖ డివిజన్ పరిధిలోని 63 బ్రాంచిల్లో ఖాళీగా ఉన్న పోస్టుమాస్టర్, సహాయ పోస్టుమాస్టర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తపాలాశాఖ డివిజన్ సూపరింటెండెంట్ కేపీ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయి, తెలుగు సబ్జెక్టు తప్పనసరిగా ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని, ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18–40 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రొద్దుటూరు : మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ సుభాని, ఎంఈఓ సావిత్రమ్మలకు ఏపీ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకురాళ్లు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోరుముద్ద పథకం మెనూకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.20 ఇవ్వాలని కోరారు. కార్మికులపై రాజకీయ వేధింపులను అరికట్టాలని, కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షురాలు శారదాదేవి, కార్యదర్శి రమీజ, ఉప కార్యదర్శి రజని, విజయనిర్మల పాల్గొన్నారు.


ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : పట్టణ బలిజ సంఘం కార్యాలయంలో శుక్రవారం యువ బలిజ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రాయల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు 552వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, రామకృష్ణ, గంగాధర్, బ్రహ్మయ్య, వెంకటేష్, హరి, సాయిలు పాల్గొన్నారు.

పశుసంవర్థక శాఖ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎన్జీఓ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్జీఓ అధ్యక్షుడు కేజీ రఘురామిరెడ్డి పశుసంవర్థక శాఖకు సంబంధించిన 2023 డైరీని శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సెక్రటరి సి సదాశివయ్య, తాలుకా సెక్రటరి రామసుబ్బయ్య, మైదుకూరు తాలుకా వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సుబ్బయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, జాషువా, రమేష్, అశోక్, ఆరిఫ్, సునీల్, సిద్దేశ్వరి, వినోద్, పాపిరెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు : ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని తోకలపల్లె, తిమ్మారెడ్డిపల్లె గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఆయా పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేయడంతో పాటు తమ ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం నవరత్నాలుతో పాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి కనీసం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల పైనే లబ్ధి చేకూరిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలను అందిస్తున్నామని వివరించారు. గడప గడపకు ప్రాధాన్యత ఇస్తూ అత్యవసర పనులు చేపట్టేందుకు ప్రతి పంచాయతీకి రూ.20 లక్షల నిధులు విడుదల చేసిందన్నారు. వ్యవసాయానికి అండగా నిలిచేందుకు బ్రహ్మంసాగర్‌లో పూర్తిస్థాయి నీటిని నింపామని, గత మూడేళ్ళుగా చెరువులు నిండుగా ఉండి పంటలు సమృద్ధిగా పండుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నామని, తమకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్నురాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బీరం ఉమ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కల్లూరు రమణారెడ్డి, రజాసాహెబ్‌పేట సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాయకులు చిత్తాగిరి ప్రణీత్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, కాటసాని వెంకటరెడ్డి, మైసూరారెడ్డి, ఘట్టమనేని నారాయణ, జయరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఏపీఎం అశోక్‌రెడ్డి, ఏఈ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ పరిధి చిన్నకప్పలపల్లె, పెద్దకప్పలపల్లె, జయనగర్‌లలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ నిర్వహిస్తారని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. తిమ్మారెడ్డిపల్లె, చిన్నకప్పలపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి ప్లాంట్‌లను ఆమె ప్రారంభిస్తారని తెలిపారు.

జగనన్న పాలనలో అందరికీ సంక్షేమం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ బావుటా అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలూరు ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోకి రాగానే ఇంద్రసేనారెడ్డి, ఉపసర్పంచ్ సుధారాణి, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించి సంక్షేమబావుట బుక్‌లెట్‌ను అందించారు. పింఛన్లు, ఇళ్లు, సీసీ రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి పైపులైన్ వేయించాలని, మసీదుకు ప్రహరీ నిర్మించాలని, ప్రొద్దుటూరు నుంచి రాజుపాళెం మీదుగా హైదరాబాద్‌కు బస్సు నడపాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. మైలవరం కాలువ మీదుగా పంట పొలాలకు వెళ్లే రహదారిలో మరమ్మతులు చేపట్టాలని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కొత్తకొట్టాలలో ఓ బాలిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఎమ్మెల్యేకు విన్నవించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరోగ్యం బాగు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కార్యకర్త రఘురాముడుకు ఇటీవల అనారోగ్యంతో కాలు తొలగించడంతో ఆయన ఇంటి వద్దకు ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, సర్పంచ్ షాజియ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కాకర్ల నాగేషారెడ్డి, బండారు సూర్యనారాయణ, మార్కెట్ యార్డు మాజీ వైస్ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యురాలు బండి గౌషియ, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ గల పార్టీ

పద్మశాలియ కార్పొరేషన్ ఛైర్మన్ జింకా విజయలక్ష్మి



మాట్లాడుతున్న పద్మశాలీయ కార్పోరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి

ప్రొద్దుటూరు క్రైం : నకిలీ నోట్ల వ్యవహారంలో అరెస్ట్ అయిన రసపుత్ర రజనీని బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి నుంచి ప్రభుత్వం తొలగించినట్లు పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. దొంగనోట్ల వ్యవహారానికి సంబంధించి రజని అరెస్టైన విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పార్టీ అధిష్టానానికి, సీఎం దృష్టికి తీసుకెళ్లారన్నారు. రజనీని పార్టీ నుంచే గాక డైరెక్టర్ పదవి నుంచి తొలగించాలని కోరారన్నారు. దీంతో స్పందించిన కేంద్ర పార్టీ కార్యాలయం ఎమ్మెల్యే సూచన మేరకు వెంటనే రసపుత్ర రజనీని పార్టీ నుంచి సస్పెండ్ చేసిందన్నారు. అంతేగాక బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి నుంచి కూడా ప్రభుత్వం తొలగించిందని ఆమె చెప్పారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరి జి జయలక్ష్మి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ గల పార్టీ అనడానికి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. క్రమశిక్షణ లోపిస్తే ఎవరి విషయంలోనైనా పార్టీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు టీడీపీ మహిళా అధ్యక్షురాలు బోగా లక్ష్మినారాయణమ్మ పొదుపు సంఘాల మహిళలకు చెందిన రూ. 40 లక్షలు స్వాహా చేసిన కేసులో జైలుకు వెళ్లిన విషయాన్ని ప్రజలు ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. 300 మంది మహిళల సొమ్మును స్వాహా చేస్తే ఆమెపై టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో వివిధ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు తుపాకుల వెంకటరమణ, ఉప్పర మురళీధర్, చౌడం రవిచంద్ర, ఉమా మహేశ్వరి, రాగా నరసింహులు పాల్గొన్నారు.

భూ సేకరణపై రైతులతో సమావేశం

చాపాడు : మండలంలోని పిచ్చపాడు గ్రామ రెవెన్యూ గ్రామాలైన జడ్డిగారి కొట్టాలు, ద్వారకా నగరం గ్రామ రైతులతో శుక్రవారం భూ సేకరణపై తహసీల్దారు సుభానీ సమావేశమయ్యారు. జాతీయ రహదారి వెంబడి ఎకరా రూ.2 కోట్ల ధరల పలుకుతోందని కేంద్ర ప్రభుత్వం ఎకరానికి రూ.9లక్షల మాత్రమే ఇస్తుందని దీంతో తాము నష్టపోతామని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూములు ఇవ్వాలని ఏవైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదులు చేయాలన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షలు రైతులకు పరిహారం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కేసీ రాజు, సర్వేయర్ సాయిలత, వీఆర్వోలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి



మరాటిపల్లె జగనన్న కాలనీలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళేశ్వర్

బి.కోడూరు : జగనన్న ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకుని వారి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. శుక్రవారం బి.కోడూరు పంచాయతీ పరిధి గ్రామాల్లో జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. త్వరితగతిన పూర్తి చేసి లక్ష్యాలను చేరుకునేలా అధికారులు, లబ్ధిదారులు కృషి చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు బిల్లులు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వర్‌రావు

గోపవరం : చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎ.నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని రాచాయపేటలో నిర్వహించిన చిరుధాన్యాల సాగు–వినియోగంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు రావడంతో 2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ మేరకు పంటల సాగు, ఉపయోగాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వరి, సజ్జ పంటల పైనే రైతులు ఆధారపడుతున్నారని, ఈ పంటల వలన ఖర్చు అధికంగా ఉండటమే కాక రాబడి తగ్గుతుందన్నారు. చిరుధాన్యాల సాగుకు ఈ ప్రాంతం అనువైనదని, తక్కువ నీరు, ఖర్చు తక్కువ, రసాయనిక ఎరువుల వాడకం తక్కువగా ఉండటంతో రైతుకు లాభసాటిగా ఉంటుందని, దీంతో రైతులు పంటల సాగుకు మొగ్గు చూపాలని ఆయన కోరారు. వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు మంచి అవగాహన ఉందని, ఇంకా అవసరమైన సలహాలు, సూచనలు వ్యవసాయాధికారుల ద్వారా తెలుసుకుని ముందుకు వెళ్లాలన్నారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం ఉటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవిందనాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో మంచి మార్కులు సాధించాలి



మాట్లాడుతున్న బద్వేల్ ఏఎస్‌డబ్ల్యూఓ రామయ్య

బ్రహ్మంగారిమఠం : త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని బద్వేల్ ఏఎస్‌డబ్ల్యూఓ ఎం.రామయ్య తెలిపారు. శుక్రవారం బి.మఠంలోని ప్రభుత్వ బాలుర సమీకృత వసతి గృహంలో బద్వేల్ ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని బద్వేల్, పోరుమామిళ్ళ, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, బ్రహ్మంగారిమఠంలలోని 10వతరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థులు 240మందికి ప్రేరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా భోజనంతో పాటు వసతులు, అందుకు తగ్గట్టుగా చదువులు అందిస్తుందన్నారు. 10వతరగతిలో విద్యార్థులు మంచిగా చదువుకొని ధైర్యంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందుతారన్నారు. కార్యక్రమంలో అధికారులు మునెయ్య, నరసింహరెడ్డి, బి.మఠం బాలికల హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓలు వెంకటేశ్వరమ్మ, విజయమ్మ, బద్వేల్ నుంచి లక్ష్మిదేవి, వివిధ మండలాల నుంచి వచ్చిన హెచ్‌డబ్ల్యూఓలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

30న తలనీలాల సేకరణకు వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ కోసం ఈనెల 30వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సి.శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, మిగిలిన రోజుల్లో తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని బద్వేలు దేవాదాయశాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, అలాగే మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకు తలనీలాలు సేకరించేందుకు వేలంపాటలో పాల్గొనేందుకు రూ.25 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, హెచ్చు పాటదారుడు వేలం పాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి మొత్తం నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. అలా చెల్లించని యెడల పాటదారుని డిపాజిట్‌ను అపరాధ రుసుము కింద దేవస్థానం ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం దేవాదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కలసపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రోగ్రెసివ్ డెమోక్రిటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కలసపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజును గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గురువయ్య, వీరయ్య, పోలయ్య, హుస్సేన్‌పీరా, బాబు, నరసింహులు, అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధి నిరోధకుడు ఎవరో అందరికీ తెలుసు



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లదాదాపీర్

ప్రొద్దుటూరు క్రైం : దర్గా అభివృద్ధికి నోచుకోకుండా అడ్డు పడింది ఎవరో అందరికీ తెలుసునని వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్లదాదాపీర్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనుచరులతో ముక్తియార్ విలేకరుల సమావేశం నిర్వహించి వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దర్గా నిర్మాణం కోసం వసూలు చేసిన చందాలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. ఒక హిందువైనా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి రూ. 1 కోటి దర్గా నిర్మాణం కోసం ఇచ్చారన్నారు. తాను కూడా నిర్మాణానికి అవసరమయ్యే సిమెంట్ బస్తాలను అందిస్తున్నట్లు దాదాపీర్ తెలిపారు. రూ. 10 లక్షలు దర్గా నిర్మాణానికి ఇస్తానని చెప్పిన ముక్తియార్ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఎంపీ నిధులు ఇచ్చారని బీజేపీ నాయకుల ఫోటోను ఈద్గా మైదానంలో ముక్తియార్ పెట్టించిన విషయాన్ని ముస్లింలు మరచిపోరన్నారు. ముస్లింల సంక్షేమం కోసం పాటుపడుతున్నానని చెబుతున్న ముక్తియార్ పోట్లదుర్తి బీజేపీ నాయకులకు సేవ చేస్తున్నాడని తెలిపారు. తన కుమారుడు దొడ్డి దారిన మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచాడని ఆరోపిస్తున్న ముక్తియార్ ఏ దారిన కూడా గెలవలేక పోయాడన్నారు. వ్యక్తిగత విషయాల జోలికి వెళ్తే అందరి భాగోతాలను వెలికి తీస్తానని తెలిపారు. గతంలో తనకు కౌన్సిలర్ టికెట్ ఇచ్చింది ముక్తియార్ కాదని, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అని 25వ వార్డు ఇన్‌చార్జి నూరి అన్నారు. ఎన్నికల ఖర్చు కోసం డబ్బు కూడా ఆయనే ఇచ్చారన్నారు. తనకు డబ్బు ఇచ్చానని ముక్తియార్ అసత్యాలు చెబుతున్నాడని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు హనీఫ్, హిదాయత్ పాల్గొన్నారు.

కషాయాలతో భూమి సారవంతం



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాలతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జీవీ సత్రంలో నాబార్డు సహాయంతో డీపీసీసీ, హీడ్స్ సంస్థల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీఎం రామకృష్ణరాజు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఎంతో మేలన్నారు. రసాయనిక ఎరువుల వల్ల భూమి సారం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు. అందువల్ల ప్రకృతి వ్యవసాయంలో రైతులందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, హీడ్స్ కార్యదర్శి సురేష్, డీపీసీసీ సీఆర్పీలు సీహెచ్ బాలయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



భోజనాన్ని పరిశీలిస్తున్న కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా

ఖాజీపేట : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఏ.కరీముల్లా నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్తపేట హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. నాణ్యతలో అసలు రాజీ పడకూడదని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలలోని సమస్యలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల కొరతతోపాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు, జెడ్పీ చైర్మన్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కొత్తపేట మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం



పంటలను పరిశీలిస్తున్న అదనపు డీపీఎం వసంతకుమారి

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పెట్టుబడి తగ్గించుకొని నికర ఆదాయాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అదనపు డీపీఎం వసంతకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అయిదంతస్తుల నమూనాలో పండిస్తున్న పంటలను అదనపు డీపీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే పంటతో ఆదాయం కోసం ఎదురుచూడకుండా అయిదంతస్తుల నమూనా కింద తీగ జాతి పండ్ల మొక్కలు నాటి నిత్యం ఆదాయం పొందాలని సూచించారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు పెంచుతున్న కిచెన్ గార్డెన్లను ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు శివబ్రహ్మయ్య, రామానందరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలను పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : రహదారి భద్రత నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని గ్యారేజీలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ప్రజల్లో ఉండే నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది వ్యవహరించాలని కోరారు. బస్సు కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకుని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని, అటువంటి వాటికి స్వస్తి పలకాలని సూచించారు. డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడిపి ప్రమాద రహిత డిపోగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మైదుకూరు, పరిసర గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.